

జాతీయ వాలీబాల్ పోటీలో కాంస్య పతకం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 24 నుంచి 28 వరకు చెన్నైలో జరిగిన 19 సంవత్సరాల లోపు బాలుర ఆల్ ఇండియా ఖేలో ఇండియా వాలీబాల్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టు తరుపున విజయనగరం జిల్లా క్రీడాకారుడు వై యోగేంద్ర పాల్గొన్నాడు. ఈ పోటీల్లో మన రాష్ట్ర జట్టు మూడో స్థానం సాధించి బ్రాంజ్ మెడల్ సాధించింది. మెడల్ సాధించిన జట్టులో జిల్లా క్రీడాకారుడు ఉన్న జట్టుకు, క్రీడాకారుడికి రాష్ట్ర వాలీబాల్ సంఘం కార్యదర్శి భగవాన్ దాస్, జిల్లా వాలీబాల్ సంఘం కార్యదర్శి కె.వి ఏఎన్ రాజు, అధ్యక్షులు సూరిబాబు , జాయింట్ సెక్రెటరీ కృష్ణంరాజు , ట్రెజరర్ సన్యాసినాయుడు , చీఫ్ పాట్రన్ కనకల కృష్ణ, జిల్లా వాలీబాల్ సంఘం సభ్యులందరూ అభినందించారు.

డిఎస్‌సి ఉన్నట్టా..లేనట్టా!

ఉపాధ్యాయ పోస్టుల భర్తీపై ప్రభుత్వం ప్రకటనలకే పరిమితమైంది. ఇదిగో అదిగో అంటూ గత కొద్దినెలలుగా ప్రభుత్వం నిరుద్యోగులను ఊరిస్తోంది. తాము అధికారంలోకి వస్తే ఏటా డిఎస్‌సి నోటిఫికేషన్ ఇస్తామంటూ ఇచ్చిన మాటనూ ప్రభుత్వం తప్పింది. ఎన్నికల నేపథ్యంలో చివరి సంవత్సరంలోనైనా నోటిఫికేషన్ వస్తుందని ఆశించిన అభ్యర్థులకు తీవ్ర నిరాశే మిగిలింది. ఇటీవల విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సైతం నోటిఫికేషన్ ఇస్తున్నామంటూ ప్రకటించడంతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయి. ప్రభుత్వం వైపు నుంచి మాత్రం ఎటువంటి ప్రక్రియ ప్రారంభం కాకపోవడంతో నోటిఫికేషన్ వస్తుందా? లేదా? అనే సందేహం వ్యక్తం చేస్తున్నారు.

- నోటిఫికేషన్‌పై అభ్యర్థుల్లో ఆందోళన
- జిల్లా నుంచి ప్రతిపాదనలే పంపని విద్యాశాఖ



ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉమ్మడి జిల్లాలో 18 వరకు బిఇడి కళాశాలలు ఉన్నాయి. కోర్సు రెండేళ్ల కాలపరిమితి కావడంతో ప్రతి రెండేళ్లకు సుమారు 900 మంది రిలీవ్ అవుతున్నారు. మరో వైపు డైట్ కాలేజీలు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఒక కాలేజ్,ప్రైవేటు కాలేజీలు 8వరకు ఉన్నాయి. ఈ కాలేజీ ల నుంచి 800మంది వరకు రిలీవ్ అవుతున్నారు. వీరు కాకుండా ఇప్పటికే బిఇడి, డిఇడి కోర్సులు పూర్తి చేసి ఉద్యోగాలు రానివారు వేలాది మంది ఉన్నారు. టిడిపి హయాంలో 2018 అక్టోబరు 25న చివరి సారిగా నోటిఫికేషన్ వెలువడింది. ఆ తర్వాత ఉపాధ్యాయ ఉద్యోగ నియామకాలు జరగలేదు. దీంతో వేలాది మంది నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారు. డిఎస్‌సి నోటిఫికేషన్ ఇస్తామని ప్రభుత్వం చెప్తున్నా ఆ వైపుగా అడుగులు మాత్రం పడటం లేదు. నోటిఫికేషన్ కోసం జిల్లాల నుంచి వివరాలు సైతం తీసుకోలేదని విద్యా శాఖ అధికారులు చెబుతున్నారు. ఏడాదిన్నర కిందట అధికారులు పంపిన వివరాలు మినహా కొత్తగా ఏమీ పంపలేదని తెలుస్తోంది. దీంతో డిఎస్‌సి నోటిఫికేషన్ మాట ఉత్తదే అనే చర్చ జరుగుతోంది.

కొత్త ఉద్యోగాల భర్తీ వద్దంటూ ప్రత్యేక ఆదేశాలు

ఉద్యోగాల భర్తీపై ఆర్థికశాఖ ఇటీవల జారీ చేసిన ఆదేశాలు నిరుద్యోగులను తీవ్ర నిరాశకు గురిచేశాయి. ఏ ప్రభుత్వ శాఖలోనూ ప్రస్తుతం కొత్తగా ఉద్యోగాల భర్తీకి ప్రతిపాదనలు పంపొద్దని సూచించినట్లు తెలిసింది. పోస్టుల అప్ గ్రేడేషన్, కొత్త పోస్టుల ఏర్పాటుకు సన్నాహాలు చేయొద్దని రాష్ట్ర ప్రభుత్వం సూచించినట్లు తెలిసింది. చివరకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను సైతం నియమించొద్దంటూ ఉత్తర్వులు వెలువరించింది. ఈ నేపథ్యంలో డిఎస్‌సి నోటిఫికేషన్ వచ్చే అవకాశం లేదని విద్యాశాఖకు చెందిన అధికారులు అభిప్రాయపడుతున్నారు. నోటిఫికేషన్ ఇస్తామని ఊరించి ప్రభుత్వం తమను మోసం చేసిందంటూ పలువురు నిరుద్యోగ అభ్యర్థులు అభిప్రాయ పడుతున్నారు. ఎన్నికలు వస్తుండటంతో నిరుద్యోగుల ఆగ్రహాన్ని చల్లార్చడానికే విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ నోటిఫికేషన్ ప్రకటనలు చేస్తున్నారంటూ మండిపడుతున్నారు.

నిరుద్యోగుల్లో తీవ్ర నిరాశ

ఎన్నికలు సమీపిస్తున్నప్పటికీ డిఎస్‌సి నోటిఫికేషన్ వచ్చే అవకాశం లేకపోవడంతో నిరుద్యోగుల్లో తీవ్రనిరాశ, నిస్పృహలు నెలకొన్నాయి. సుమారు ఆరేళ్లగా డిఎస్‌సి నోటిఫికేషన్ లేకపోవడంతో బిఇడి, డిఇడి కోర్సులు చేసిన వారు ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా చేరిపోయారు.కొంతమంది ప్రయివేట్ ఉద్యోగాల్లో కుదురుకున్నారు. మరికొంతమంది వాలంటీర్లుగా సేవలు అందిస్తున్నారు. విద్యాశాఖ మంత్రి గత కొద్ది నెలలుగా డిఎస్‌సికి సంబంధించి ప్రకటనలు చేయడంతో నిరుద్యోగ ఉపాధ్యాయుల అంతా ప్రిపరేషన్ మొదలు పెట్టేశారు. తాజాగా టెట్ నోటిఫికేషన్ రావడంతో ఆశలు చిగురించాయి. అయినా ఎన్నికల నోటిఫికేషన్ మరి కొద్ది రోజుల్లో రానుండడంతో డిఎస్‌సి నోటిఫికేషన్‌పై ఆశలు సన్నగిల్లుతున్నాయి. అయినా నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేస్తారనే నమ్మకంతో వేలాదిమంది విజయనగరం జిల్లా కేంద్రంలో అద్దె రూములో,కోచింగ్ సెంటర్లో చేరి చదువుతున్నారు.లక్షలు రూపాయిలు ఖర్చు చేస్తున్నారు. ప్రభుత్వం తీరు చూసి ఆవేదన చెందుతున్నారు. వారం రోజుల క్రితం డిఎస్‌సి నోటిఫికేషన్ కోసం డివైఎఫ్ఐ ఆధ్వర్యాన నిరుద్యోగులు ఆందోళనలు చేపట్టారు.

జిల్లాలో ఖాళీలు లేవు

ఉమ్మడి జిల్లాలో ఒక్క ఉపాధ్యాయ పోస్టు కూడా ఖాళీల లేవు. గత సారి జరిగిన బదిలీలు తర్వాత జిల్లా విద్యా శాఖ అధికారులు జిల్లాలో ఎటువంటి ఖాళీలు లేవని అదనపు టీచర్లను చూపించారు. కొత్త డిఎస్‌సి నోటిఫికేషన్ వచ్చినా ఉపాధ్యాయ ఖాళీలు లేకపోవడంతో కొత్త పోస్టులు సృష్టించి ఇవ్వాలి తప్ప ఖాళీలు లేవని విద్యా శాఖ అధికారులను చెబుతున్నారు. ప్రభుత్వం కేవలం ఎన్నికల కోసం డిఎస్‌సి నోటిఫికేషన్ అంటూ డ్రామాలు ఆడుతున్నారని డిఎస్‌సి అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని కోట జంక్షన్ వద్ద బై ఠాయించిన నిరుద్యోగులు

నోటిఫికేషన్ తక్షణమే విడుదల చేయాలి

నిరుద్యోగ జెఎసి డిమాండ్ • కోట జంక్షన్ వద్ద ధర్నా,రాస్తారోకో

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వం దాట వేత ధోరణి మానుకొని డిఎస్‌సి నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని నిరుద్యోగ జెఎసి డిమాండ్ చేసింది. జెఎసి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కోట జంక్షన్ వద్ద నిరుద్యోగులు పెద్దఎత్తున నిరసన ధర్నా,రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నిరుద్యోగ జెఎసి రాష్ట్ర కన్వీనర్ షేక్ సిద్దిక్, కో కన్వీనర్ పవన్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతను మోసం చేసిందన్నారు. ముఖ్యమంత్రి ప్రతిపక్షనేతగా పాదయాత్ర సమయంలో అధికారం లోకి వచ్చిన తర్వాత 25వేల పోస్టులతో మెగా డిఎస్‌సి ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఐదేళ్లయినా డిఎస్‌సి ప్రకటన చేయలేదని, అన్నారు. ముఖ్యమంత్రి చేతిలో మోసపోయి నిరుద్యోగులు రోడ్లు మీదకు రావాల్సిన పరిస్థితి ఏర్పడింద న్నారు. మంతి బొత్స ఈరోజు, రేపు అంటూ నోటిఫికేషన్ రాకుండా కాలయాపన చేస్తున్నారని అన్నారు. తప్పు దోవ పట్టించడం మానుకొని తక్షణమే 23వేల పోస్టులుభర్తీ చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయకపోతే మంత్రులు, ప్రజాప్రతి నిధులను రోడ్లు మీదకు రానివ్వబోమని, వారి ఇళ్లు ముట్టడిస్తామని, ఎన్నికల ప్రచారానికి రానీయకుండా చేస్తామని హెచ్చరించారు.

ఇవిఎంల గోడౌన్ తనిఖీ

ప్రజాశక్తి- నెల్లిమర్ల

నెలవారీ తనిఖీల్లో భాగంగా నెల్లిమర్లలోని జిల్లాస్థాయి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపరిచే గోడౌన్‌ను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మంగళవారం తనిఖీ చేశారు. సి.సి.టివి మోనిటర్లను పరిశీలించి లోపల వున్న ఇవిఎం యంత్రాల పరిస్థితిని తెలుసుకున్నారు. సిసిటివిలకు సంబంధించి ఎక్కువ రోజుల ఫీడ్ అవసరం ఉంటుందని, అదనపు స్టోరేజీకోసం హార్డ్ డిస్కులు సిద్ధంచేసుకోవాలని ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీకాంత్‌కు సూచించారు. ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ బి.సహాదిత్ వెంకట్ త్రివినాగ్, ఆర్‌డిఓ. ఎం.వి.సూర్యకళ, నెల్లిమర్ల తహశీల్దార్ ధర్మరాజు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీకాంత్, డిప్యూటీ తహశీల్దార్ సూర్య తదితరులు పాల్గొన్నారు.

గాంధీ స్ఫూర్తితో రాజ్యాంగాన్ని రక్షించుకుందాం

సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గాంధీ స్ఫూర్తితో రాజ్యాంగ రక్షణకు ప్రజంతా ఐక్యంగా ఉద్యమించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ పిలుపునిచ్చారు. గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం స్థానిక ఎల్‌బిజి భవనంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 77ఏళ్ల స్వాతంత్ర్య భారతావని మతస్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యం, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా అవతరించిందని తెలిపారు. కానీ వీటన్నింటినీ కల్పించిన రాజ్యాంగానికి ప్రమాదం వచ్చిందని, రాజ్యాంగంలో లౌకిక తత్వం అనే పదాన్ని తొలగించాలని ఎన్‌డిఎ ప్రభుత్వం చేసిన నిర్ణయం వెనుక కుట్ర దాగుందని అన్నారు. రాజకీయాల్లోకి మతాన్ని తీసుకురావడం సరైనది కాదని అన్నారు. ఇప్పటికే పౌర సత్వం చట్ట సవరణ చేసి సిఎఎ చట్టాలు తెచ్చిన ఎన్‌డిఎ, బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ మనువాద సిద్ధాంతాన్ని తిప్పికొట్టాలన్నారు. అప్పుడే రాజ్యాంగాన్ని రక్షించుకోగలమని అన్నారు. రాజ్యాంగ రక్షణ కోసం గాంధీ గారి స్ఫూర్తి తో దేశ ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో. సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకర్రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పి.రమణమ్మ, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అర్.ఆనంద్, ఐద్వా జిల్లా అధ్యక్షులు పుణ్యవతి, కార్యదర్శి లక్ష్మి, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు హరీష్, నాయకులు సతీష్ పాల్గొన్నారు.



గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

భావితరాలకు ఆదర్శప్రాయుడు గాంధీ : కోలగట్ల

గాంధీ ఆశయాలు భావితరాలకు ఆదర్శప్రాయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. కన్యకా పరమేశ్వరి ఆలయం వద్దనున్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం తమ ప్రాణాలను సైతం అర్పించిన ఎంతోమంది మహనీయులు చరిత్రలో నిలిచిపోయారన్నారు. నగరంలో మూడు లాంతర్ల నుంచి సిఎంఆర్ జంక్షన్ వరకు మహాత్మా గాంధీ రోడ్డుగా పిలవబడుతుందన్నారు. ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచ్ వద్ద త్వరలో మహాత్మా గాంధీ విగ్రహాన్ని నెలకొల్పుతున్నట్లు చెప్పారు. నగరంలో అనేక ప్రాంతాలలో మహానుభావుల విగ్రహాలను నెలకొల్పామన్నారు. నగరం అన్ని విధాల అభివృద్ధి చెందాలన్నదే తన అభిమతమని పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో కుమ్మరిగుంటి శ్రీనివాస్, వెత్సా శ్రీనివాసరావు, కాపుగంటి ప్రకాష్ పాల్గొన్నారు.

ఒప్పంద జీవోలు అమలుకు సత్యాగ్రహ దీక్ష

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

16 రోజుల మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ,గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ రాతపూర్వకంగా ఇచ్చిన హామీలకు వెంటనే జీవోలు ఇవ్వాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో స్థానిక నగరపాలక సంస్థ వద్ద కార్మికులు మంగళవారం సత్యాగ్రహం నిర్వహించారు. ముందుగా జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. జీతాలు లేక అప్పులపాలై ఆత్మహత్యకు పాల్పడిన ప్రొద్దుటూరు క్లాప్ ఆటో డ్రైవర్ ఆంజనేయులు చిత్రపటానికి సిఐటియు నగర కార్యదర్శి బి.రమణ పూలమాలవేసి సత్యాగ్రహాన్ని ప్రారంభించారు. అనంతరం యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ. జగన్మోహన్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్బంధాన్ని, పోటీ కార్మికుల్ని ఎదుర్కొని పోరాడి విజయం సాధించిన మున్సిపల్ కార్మికులకు జేజేలు తెలిపారు. చర్చల్లో గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ రాతపూర్వకంగా అంగీకరించిన బేసిక్ వేతనం పారిశుధ్య కార్మికులకు రూ.21వేలు, డ్రైవర్లకు రూ.24500, రిటైర్మెంట్ బెనిఫిట్స్ 75వేలు, మట్టి ఖర్చులు రూ.20వేలు, సహజ మరణానికి రూ.2లక్షలు, విధుల్లో మరణిస్తే 7 లక్షలు ఇస్తామన్న జీవోలు వెంటనే ఇవ్వాలని, ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్, సెమిస్కిల్డ్ వేతనాలు, క్లాప్ వాహన డ్రైవర్లకు చట్టబద్ధమైన జీత,భత్యాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఇచ్చిన జీవో నెంబర్ 12 , 17, ప్రకారం సంక్రాంతి కానుక రూ. 1000, సమ్మె కాలపు జీతం ఇవ్వాలని, సరెండర్ లీవ్ డబ్బులు చెల్లించాలని, రక్షణ పరికరాలు, పనిముట్లు ఇవ్వాలని, జిపిఎస్ అకౌంట్లో ఓపెన్ చేయాలని డిమాండ్ చేశారు. సత్యాగ్రహంలో సిఐటియు నగర ఉపాధ్యక్షులు రెడ్డి శంకర్రావు, నాయకులు పైడిరాజు, రాఘవ ,మురళి, వంశీ, నారాయణరావు, సూరి, శంకర్రావు, లక్ష్మి,నాగరాజు, అప్పలరాజు పాల్గొన్నారు.

రాజాం : మున్సిపల్ సమ్మె ఒప్పందాల అమలు కోసం గాంధీ వర్ధంతి సందర్భంగా రాజాం మున్సిపల్ కార్యాలయం వద్ద సత్యాగ్రహం దీక్షను సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ రామ్మూర్తి నాయుడు ప్రారంభించారు. అనంతరంమాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలపై చర్చల్లో అంగీకరించిన ఒప్పందాలకు సంబంధించి ప్రభుత్వం జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మీద నమ్మకంతో సమ్మె విరమించి 17 రోజులు గడుస్తున్నా చర్చల్లో చేసుకున్న ఒప్పందాలకు సంబంధించి జీవోలు విడుదల చేయాలని, లేదంటే మరో పోరాటం తప్పదని హెచ్చరించారు. దీక్షలో అనిల్ కుమార్, లక్ష్మీ, సింహాచలం, శోభన్ బాబు, కృష్ణ, రఘు, రాంబాబు, శంకర్రావు, చినబాబు, పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద సత్యాగ్రహ దీక్ష చేస్తున్న నాయకులు, కార్మికులు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

గిడ్డంగుల నిర్వహణకు కమిటీ

వ్యవసాయ సలహా మండలి సమావేశంలో కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో అన్ని విభాగాల వద్ద ఉన్న గిడ్డంగుల నిర్వహణకు, వినియోగానికి సంబంధించి పర్యవేక్షణ చేయడానికి జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. అందుకోసం వెంటనే ప్రతిపాదనలను పంపాలని వ్యవసాయ శాఖ జెడి తారక రామారావుకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిరు ధాన్యాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని , రైతులకు అవగాహన కలిగించి జిల్లాలో చిరుధాన్యాల సాగును పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ ఏడాది 4 వేల ఎకరాల్లో లక్ష్యంగా చేసుకోగా 2 వేల ఎకరాల్లో రాగి పంట వేయడం జరిగిందని, వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా పంట సాగు తగ్గిందని జెడి తెలిపారు. ఎఎబి చైర్మన్ వెంకటేశ్వర రావు మాట్లాడుతూ మొక్క జొన్నతో రైతులకు అధిక లాభాలు వస్తున్నాయని, రాగిలో హై ఈల్డ్ వెరైటీ ఇచ్చి ప్రోత్సహిస్తే గాని అంత లాభదాయకం కాదని అన్నారు. ఈ ఏడాది వరి దిగుబడులు గత ఏడాది కన్నా అధికంగా వచ్చాయని జెడి తెలుపగా ధాన్యం సేకరణ, బిల్లుల చెల్లింపుల్లో కృషిని ఎఎబి చైర్మన్ అభినందించారు. సమావేశంలో డిసిఎంఎస్ చైర్మన్ డాక్టర్ భావన, డిసిసిబి చైర్మన్ చిన్న రామునాయుడు, సహాయ కలెక్టర్ వెంకట త్రివినాగ్, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు

సుప్రీంకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు

విజయనగరం కోట : సుప్రీంకోర్టు తీర్పు జగన్ రెడ్డి ప్రభుత్వానికి చెంపపెట్టు అని విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిమిడి నాగార్జున అన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తమ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు పై పెట్టిన అక్రమ కేసుల్లో ఒకటైన ఇన్నర్ రింగ్ రోడ్ కేసులో జగన్ రెడ్డి ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలిందన్నారు. చంద్రబాబు ముందస్తు బెయిల్ రద్దు చేయాలని ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిందని అన్నారు.

సర్పంచ్‌ల నిరసన దీక్ష



ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమస్యలు పరిష్కరించి తమను ఆదుకోవాలని సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు రౌతు స్వామి నాయుడు, పంచాయితీ రాజ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గేదెల.రాజారావు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద సర్పంచ్‌లు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని 12,918 గ్రామ పంచాయతీలలోని 3.50 కోట్ల గ్రామీణ ప్రజల సంక్షేమం, అభివద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పంపిన 14వ ఆర్థిక సంఘం నిధులు గ్రామ పంచాయితీలకు ఇవ్వకుండా, చెక్కులపై సర్పంచుల సంతకాలు లేకుండా, వారికి చెప్పకుండా గ్రామ పంచాయతీల సిఎఫ్ఎంఎస్ అకౌంట్ల నుంచి నిధులను రాష్ట్ర ప్రభుత్వం దొంగిలించి తమ సొంత అవసరాలకు, పథకాలకు వాడుకుంటున్నదని అన్నారు. ఇది రాజ్యాంగ వ్యతిరేకమని, రాష్ట్ర ప్రభుత్వం సర్పంచ్‌లకు వెన్నుపోటు పొడిచినట్లేనని పేర్కొన్నారు. 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.8,629.79 కోట్లు తక్షణమే తిరిగి తమ పంచాయతీలకు జమచేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామ వాలంటీర్లను, గ్రామ సచివాలయాలను గ్రామ పంచాయతీలలో విలీనం చేసి, సర్పంచ్‌ల ఆధ్వర్యంలోనే అన్ని రకాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. కేవలం రూ.3 వేలుగా ఉన్న సర్పంచ్‌ల- ఎంపిటిసిల గౌరవవేతనాలను రూ.15 వేలకు, ఎంపిపి, జడ్‌పిటిసిలకు రూ.30 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. క్లాప్ మిత్రలకు గతంలో మాదిరి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. దీక్షలో సర్పంచుల సంఘం నాయకులు ఈగల సత్యారావు, సర్పంచులు గొట్టాపు అప్పలస్వామి, పిన్నింటి సన్యాసి నాయుడు, ఎల్. శ్రీనివాసరావు, రొంగలి సత్యనారాయణ, చందక చిన్నంనాయుడు, పోతల రాజప్పన్న తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన పెరగాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

కుష్టువ్యాధిపై ప్రజల్లో అవగాహన పెరగాలని డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు అన్నారు. కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం నిర్వహించిన ర్యాలీని డిఎంహెచ్‌ఒ సర్వజన ఆస్పత్రి వద్ద ప్రారంభించారు. తొలుత కుష్టు నివారణకు సందేశం చదివి ప్రతిజ్ఞ చేయించారు. పట్టణ ప్రాంతాలు, పాఠశాలలు, మతపరమైన స్థలాల్లో ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఎవరికైనా స్పర్శలేని మచ్చలు ఉంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.రాణి, ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.సూర్యనారాయణ, జిల్లా న్యూక్లియర్ వైద్యాధికారి డాక్టర్ రామేశ్వరి ప్రభూ, కుష్టు నివారణ సిబ్బంది పాల్గొన్నారు.

బాలల స్నేహపూర్వక జిల్లాగా తీర్చిదిద్దాలి

డిఆర్‌ఒ ఎస్‌డి అనిత

ప్రజాశక్తి-విజయనగరం

బాలల స్నేహపూర్వక జిల్లాగా విజయనగరాన్ని తీర్చిదిద్దాలని జిల్లా రెవిన్యూ అధికారి ఎస్‌డి అనిత బాలల సంరక్షణ అధికారులను ఆదేశించారు. బాలల సంక్షేమ సమితి త్రైమాసిక సమీక్ష సమావేశం మంగళవారం డిఆర్‌ఒ అధ్యక్షతన కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బాలల సంక్షేమ సమితి కార్యక్రమాలను సమీక్షిస్తూ బాలల హక్కుల ఉల్లంఘన జరగకుండా సంరక్షణకు, రక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. బాలల సంరక్షణ కేంద్రాలను క్రమం తప్పకుండా సందర్శించి నివేదికలను విధిగా సమర్పించాలని చెప్పారు. త్రైమాసిక సమీక్షలు క్రమం తప్పకుండా నిర్వహించడంతోపాటు అనుబంధ విభాగాలతో సమావేశాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రొబేషన్ అధికారి ఎం.శరత్, డిసిపిఒ నాగరాజు, సిబ్బంది హాజరయ్యారు.

వైద్యుల సేవలు వెలకట్టలేనివి

- కోవిడ్‌తో ప్రాణాలు కోల్పోయిన వైద్యులకు నివాళి
- ఐఎంఎ, ఆప్నా, జిడిఎ, పిఎంఎ ఆధ్వర్యాన ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం కోట

కోవిడ్ మహమ్మారి లో ప్రజలు ప్రాణాలు కాపాడి తమ ప్రాణాలు అర్పించిన వైద్యుల త్యాగాలు వెలకట్టలేనివి అని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కర్ రావు తెలిపారు. కోవిడ్ తో మృతి చెందిన వైద్యులు దినోత్సవం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ , అప్నా, గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్, పారా మెడికల్ సిబ్బంది ఆధ్వర్యంలో స్థానిక ఐఎంఎ హాల్ నుంచి సర్వజన ఆస్పత్రి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డిఎంహెచ్‌ఒ జెండా ఊపి ప్రారంభించారు. కోవిడ్ లో వైద్య సేవలు అందిస్తూ ప్రాణాలు కోల్పోయిన రవి కుమార్, భాస్కర్ రావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డిఎంహెచ్‌ఒ మాట్లాడుతూ కోవిడ్ మహమ్మారిలో ప్రజలు ప్రాణాలు కాపాడటంలో వైద్యులు పాత్ర మరువలేనిది అని తెలిపారు. ఆ సమయంలో వందల మంది వైద్యులు, సిబ్బంది ప్రాణాలు పోగొట్టుకున్నారని తెలిపారు. ఏటా వారిని స్మరించుకుని నివాళులు అర్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. అనంతరం ప్రముఖ వైద్యులు అశోక్ కుమర్, జె.సి.నాయుడు, వి.ఎస్.ప్రసాద్, ఎం.వెంకటేశ్వరావు, మధుకర్ మాట్లాడుతూ కోవిడ్ కాలంలో వైద్యులు చేసిన సేవలు వల్ల కొన్ని లక్షలు మంది ప్రజలు ప్రాణాలతో బయటపడ్డారని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు, శ్రీకాంత్, పద్మ కుమారి, హేమంత్ మాధవ్, ప్రవీణ్, మురళీ మోహన్, డాక్టర్ వెంకటేశ్వరరావు , నర్సింగ్ విద్యార్థులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, నర్సింగ్ విద్యార్థులు

విద్యార్థులకు బట్టలు పంపిణీ



పిల్లలకు బట్టలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

బాడంగి: కీర్తిశేషులు తెంటు భారతమ్మ 6వ వర్ధంతి సందర్భంగా గ్రామస్తులు కుటుంబ సభ్యులు కోమూరు గ్రామంలోని బీసి కాలనీ ప్రాథమిక పాఠశాలలో చదువు తున్న పిల్లలకు 20 జతలు బట్టలను పంపిణీ చేశారు. కుటుంబ సభ్యులు మాట్లాడుతూ భారతమ్మ చనిపోయిన కుటుంబ సభ్యులు చేస్తున్న మంచి కార్యక్రమాల ద్వారా ఇంకా ప్రజలు గుండెల్లో ఎప్పుడు బ్రతికే ఉంటారన్నారు. ఎంపిపి భోగి గౌరి, సర్పంచ్ తెంటు నారాయణ రావు, నాయకులు తెంటు మధుసూదన రావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధ్యక్షునిగా బోని

జామి: మండల కాంగ్రెస్ అధ్యక్షునిగా బోని అప్పారావును జిల్లా కమిటీ నియమించింది. ఈ మేరకు జిల్లా కమిటీ అధ్యక్షులు ఎస్.రమేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. బోని అప్పారావు చిరు వ్యాపారిగా ప్రసిద్ధి చెందారు. కాంగ్రెస్ పిసిసి ప్రెసిడెంట్ వైఎస్ షర్మిలా నాయకత్వం బలపడే దిశగా కృషి చేస్తానని తెలిపారు.

నైతికత, మానవ విలువలపై పరీక్ష

వేపాడ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఫిబ్రవరి 2వ తేదీన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు నైతి కత, మానవ విలువలపై, 3న పర్యావరణ విద్యపై పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కాలేజీ ప్రిన్సిపల్ అప్పారావు తెలిపారు. ఈ పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు నిర్వహిస్తామన్నారు. ఈ పరీక్షలకు విద్యార్థులు అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. గతంలో ఈ పరీక్షలకు హాజరుకాని ద్వితీయ ఇంటర్మీడియట్ విద్యార్థులు హాల్ టికెట్ నెంబర్‌తో పరీక్షకు హాజరు కావచ్చు అని తెలిపారు.

ఖేలో ఇండియాలో కాంస్యం

నెల్లిమర్ల: ఖేలో ఇండియా యూత్ గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో అయ్యన్నపేటకు చెందిన క్రీడాకారిణి చైతన్యకుమారి ప్రతిభ కనబర్చి కాంస్య పతకం సాధించారు. చెన్నైలో ఈ నెల 19 నుంచి జరుగుతున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో మంగళవారం చైతన్య కుమారి 81కిలోల విభాగంలో స్నాచ్ 75, క్లీన్ జర్క్ 94కిలోలు మొత్తం 169 కిలోల బరువెత్తి కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా చైతన్య కుమారిని జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు బెల్లాన లక్ష్మీ నాగేంద్ర, సెక్రటరీ, కోచ్ చల్లా రాము, స్టేట్ ప్రెసిడెంట్ లక్ష్మీ, సెక్రటరీ దినేష్ బాబు, బి.వెంకట రమయ్య, అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

సేవ చేయాలనే కార్యసిద్ధి గొప్పది

కొత్తవలస: వికలాంగులకు సేవ చేయాలనే కార్యసిద్ధి గొప్పదని వైజాగ్ స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా లిమిటెడ్ చైర్మన్ బండి సతీష్‌బాబు అన్నారు. మంగళవారంతెలంగాణ శ్రీచరుదేవా చారిటబుల్ ట్రస్టులో మంగళవారం ట్రస్ట్ చైర్మన్ రావిప్ప జగదీశ్ కుమార్ ఆధ్వర్యంలో వికలాంగులకు ఉపకరణాల పంపిణీ చేపట్టారు. వైజాగ్ ప్రొఫైల్, స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా లిమిటెడ్ సిఎస్ఆర్ నిధులతో 20 మంది వికలాంగులకు కృత్రిమ కాళ్లు, చేతులు, 70మంది అందులకు బ్లైండ్ స్టిక్స్, క్రాలిపర్స్, వీల్ చైర్లు పంపిణీ చేశారు. 100 మంది వృద్ధులకు బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్య చంద్ర, టి.గాంధీ, వెంకటేశ్వరరావు, ట్రస్ట్ వైస్ చైర్మన్ డాక్టర్ ఫణీంద్ర, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు పంపిణీ

చీపురుపల్లి: చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలో గల జగనన్న లేఅవుట్‌లో 41మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో సర్పంచ్ మంగళగిరి సుధారాణి, వైసిపి జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, వైసిపి మండల అధ్యక్షులు ఇప్పిలి అనంతం, జిల్లా యువజన విభాగం నాయకుడు బెల్లాన వంశీకృష్ణలు పాల్గొని పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ దరఖాస్తు చేసుకున్న 90 రోజులలో ఇంటి స్థలాన్ని ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టెలికం మెంబర్ ఇప్పిలి తిరుమల, కొసిరెడ్డి రమణ, రౌతు పైడిరాజు, మల్లిపూడి శ్రీనివాసరావు, అంబటి లోకేష్, మీసాల రామారావు, మహేష్, ముల్లు పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పరదేశిమాంబ జాతర

వేపాడ: మండలంలోని వావిలిపాడులో మంగళవారం పరదేశిమాంబ, మరిడిమాంబ జాతర వైభవంగా ప్రారంభమైంది. అమ్మవారిని దర్శించుకో వడానికి యాత్రికులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా జానపద నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బీల రాజేశ్వరి, వైసిపి గ్రామ కన్వీనర్ సతీష్, సచివాలయ కార్యదర్శి సభ్యులు, గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. బుధవారం ఎడ్ల పరుగు ప్రదర్శన నిర్వహిస్తామని సర్పంచ్ రాజేశ్వరి తెలిపారు.

సెంచూరియన్‌లో కోర్సులు భేష్!

నెల్లిమర్ల: సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో కోర్సులు చాలా బాగున్నాయని పలువురు వక్తలు చెప్పారు. విశాఖపట్నంకు చెందిన పలువురు అధ్యాపకులు, వివిధ రంగాలకు చెందిన వారు మంగళవారం సెంచూరియన్ విశ్వవిద్యాల యాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు వారికి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా విశ్వవిద్యాలయంలో అమలు చేస్తున్న కోర్సులు, ప్రయోగశాలలు తదితర వాటి గురించి వివరించారు. అనంతరం వారంతా బ్యాటరీతో నడిచే ఆటో యూనిట్, కుట్టు యంత్రాల యూనిట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, పారా మెడికల్ కోర్సులకు సంబంధించిన ప్రయోగ శాలలను తిలకించారు.

జగన్‌ను సాగనంపేందుకు జనం సిద్ధం

రామభద్రపురం: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌ను ముఖ్యమంత్రి పీఠం నుంచి దింపి ఇంటికి సాగనంపేందుకు జనం సిద్ధంగా ఉన్నారని బొబ్బిలి నియోజక వర్గ ఇంఛార్జ్ బేబీనాయన అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల సంగిపాలన వద్ద సిద్ధం పేరుతో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నిర్వహించిన సమావేశంలో ఉన్న గ్రాఫిక్స్ పిక్చర్‌లేనని ఎద్దేవా చేశారు. సమావేశంలో పార్టీ అధ్యక్షుడు విజయభాస్కరరావు, చిన్నమ్మల్లి పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు జగన్ రెడ్డికి చెంపపెట్టు

భోగాపురం: చంద్రబాబు నాయుడు పై పెట్టిన అక్రమ కేసుల్లో ఒకటైన ఇన్నర్ రింగ్ రోడ్ కేసులో జగన్ రెడ్డి ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలిందని టిడిపి నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు ముందస్తు బెయిల్ రద్దు చేయాలని ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిందన్నారు. చంద్రబాబు నాయుడుని ఇబ్బంది పెట్టాలని చూస్తున్న ఈ జగన్ రెడ్డి ప్రభుత్వానికి సుప్రీంకోర్టు తీర్పు ఓ చెంపపెట్టని అన్నారు. అధికార గర్వంతో జగన్ రెడ్డి అండ్ కో పెట్టిన కేసులు తప్పుడవి అని సుప్రీంకోర్టు తీర్పుతో వెల్లడైందని అన్నారు. సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలకు ఇప్పటికైనా జగన్ రెడ్డి, వైసిపి నాయకులు సిగ్గుపడాలన్నారు.

20 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి - రామభద్రపురం

అక్రమంగా 20 మద్యం సీసాలను తరలిస్తున్న వ్యక్తిని పట్టుకుని వాహనం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ జ్ఞాన ప్రసాద్ తెలిపారు. ఆరికతోట ప్రభుత్వ దుకాణం నుంచి బూసాయవలస గ్రామానికి చెందిన వ్యక్తి అక్రమంగా 20 క్వార్టర్ సైజ్ మద్యం సీసాలు అనుమతులు లేకుండా తరలిస్తుండగా తమ సిబ్బంది పట్టు బడినట్లు తెలిపారు. ఇప్పటికే బెల్టుషాపులకు సంబంధించిన సమగ్ర సమాచారం తమ వద్ద ఉందని అక్రమంగా మద్యం విక్రయాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది హెచ్‌సి రమణ, నాగార్జున, రమేష్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మద్దివలసలో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - వంగర


మండలంలోని మద్దివలసలో మంగళవారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో రైతు ఉత్తరావల్లి హరికి చెందిన గడ్డివాముతో పాటు 20 బస్తాల ధాన్యం కాలి బూడిద అయ్యాయని గ్రామానికి చెందిన రైతు హరి విలేకరులకు తెలిపారు. స్థానికులు అందించిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న రాజాం అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. పెను ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు.

ఆత్మగౌరవం నిలబెట్టేందుకే సంక్షేమ పథకాలు

● మేలు జరిగిన ప్రతి ఒక్కరూ అండగా నిలవాలి ● ఆసరా చెక్కుల పంపిణీలో రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి- గుర్ల

మహిళలు, పేద ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టి, వారు గర్వంగా తలెత్తుకొనేలా చేయడానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఈ పథకాల ద్వారా మేలు జరిగిన ప్రతీఒక్కరూ ముఖ్యమంత్రికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. మండలంలో ఆసరా సంబరాలను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పారదర్శకతతో కూడిన పరిపాలనను అందిస్తున్నామన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ, ఎటువంటి సిఫార్సులు, లంచాలకు తావులేకుండా నేరుగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. ప్రతీ ఇంటికీ మేలు చేశామని, మీకు మేలు జరిగిందని భావిస్తే తమ ప్రభుత్వానికి అండగా నిలివాలని ఆయన కోరారు. ప్రతి ఊరికి తాగునీరు, సాగునీరు, రహదారులు, బడి, గుడి, వైద్యం అందించాలన్నది తమ లక్ష్యమని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం కోసం వచ్చే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రి జగన్‌కు అండగా నిలబడాలని మంత్రి పిలుపునిచ్చారు. మహిళా సంఘాలకు ఆసరా చెక్కును అందజేశారు. జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ తన పాదయాత్రలో ప్రజల కష్టాలు తెలుసుకున్న ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డి, అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ సంక్షేమ పాలనకు శ్రీకారం చుట్టారని కొనియాడారు. మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన ఘనత మంత్రి బొత్స సత్యనారాయణకు దక్కుతుందన్నారు. ఎంపిపి పొట్నూరి ప్రమీల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి శీర అప్పలనాయుడు, పార్టీ నాయకులు కెవి సూర్యనారాయణరాజు, పొట్నూరి సన్యాసినాయుడు, మండల సమాఖ్య అధ్యక్షులు సన్యాసమ్మ, డిసిసిబి ఛైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు, జిల్లా పశుగణాభివృద్ధి ఛైర్మన్ బి.బంగారునాయుడు, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డిఆర్‌డిఎ పిడి ఎ.కల్యాణచక్రవర్తి, ఆర్‌డిఒ బి.శాంతకుమారి, ఎంపిడిఒ కల్యాణి, తహశీల్దార్ పద్మావతి, ఎపిఎం నారాయణరావు, పార్టీ నాయకులు బొత్స సందీప్, రెడ్డి మురళీధర్, వలిరెడ్డి శ్రీనివాసరావు, టి.తిరుపతిరావు పాల్గొన్నారు.



గుర్ల: ఆసరా చెక్కును మహిళలకు అందిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

వైసిపితో డ్వాక్రా మహిళల అభివృద్ధి: ఎమ్మెల్యే

నెల్లిమర్ల: వైసిపితో డ్వాక్రా మహిళల అభివృద్ధి సాధ్యం అవుతుందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడు అన్నారు. మంగళవారం స్థానిక థామస్‌పేట ఫుట్‌బాల్ మైదానంలో మండల స్థాయి, నగర పంచాయతీ పరిధిలో వైఎస్సార్ ఆసరా 4వ విడత సంబరాలు జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ సురేష్ బాబు, నియోజకవర్గ ఇన్చార్జ్ అందవరపు సూరిబాబు మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం సి ఎం జగన్ మోహన్ రెడ్డి డ్వాక్రా మహిళలకు రుణ మాఫీ, వడ్డీ మాఫీ చేశారని గుర్తు చేశారు. ఆసరా ద్వారా డ్వాక్రా సంఘాలు ఆర్థికంగా ఎదగడంతో బాటు ఉపాధి కూడా దొరికిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అంబళ్ళ సుధారాణి, నగర పంచాయతీ చైర్ పర్సన్ బంగారు సరోజిని, జడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు, వైస్ ఛైర్మన్ సముద్రపు రామారావు, పూసపాటిరేగ ఎఎంసి చైర్ పర్సన్ చిక్కాల అరుణ కుమారి, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యులు అంబళ్ళ శ్రీరాములు నాయుడు, నగర పంచాయతీ అధ్యక్షులు చిక్కాల సాంబశివరావు, డిసిసిబి వైస్ ఛైర్మన్ చనమల్ల వెంకటరమణ, వైస్ ఎంపిపిలు సారికి వైకుంఠంనాయుడు, పతివాడ సత్యనారాయణ, మెప్మా పీడీ బి.సుధాకరరావు, ఎంపిడిఒ జి.రామారావు, నగర పంచాయతీ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్, ఎపిఎంఎల్. సత్య నారాయణ, మెప్మా సిఎంఎం డి. గోవింద రావు, నగర పంచాయతీ కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపిటిసిలు, మహిళలు పాల్గొన్నారు.

ఆసరా బహిరంగ సభ స్థల పరిశీలన

బొండపల్లి: ఫిబ్రవరి 4 ఆదివారం మండలంలో నిర్వహించనున్న ఆసరా బహిరంగ సభా స్థలాన్ని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పరిశీలించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్ సమీపంలో గల భువి లే అవుట్‌లో గల స్థలాన్ని పరిశీలించి సభకు అనువైనదిగా అప్పలనరసయ్య నిర్ధారించారు. ఈయన వెంట ఎఎంసి ఛైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, ఎంపిపి చల్ల చలం నాయుడు, జెడ్‌పిటిసి రాపాక సూర్యప్రకాశరావు, పిఎసిఎస్ అధ్యక్షులు బివి ప్రభుజీ, ఎంపిడిఒ రాజేంద్రప్రసాద్, ఎపిఎం సులోచనారాణి, వైసిపి మండల అధ్యక్షులు బొద్దల చిన్నం నాయుడు తదితరులు ఉన్నారు.

నేడు భోగాపురంలో ఆసరా కార్యక్రమం

భోగాపురం: స్థానిక ఉన్నత పాఠశాలలో బుధవారం ఆసరా కార్యక్రమం నిర్వహిస్తున్నామని వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ సురేష్ బాబు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారని తెలిపారు. అందుకు మండలంలోని మహిళా సంఘాల సభ్యులు, ఎంపిటిసిలు, సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

జెఎఎస్‌తో మెరుగైన వైద్యం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నాంది పలికారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని కలవరాయి గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష -2 శిబిరాన్ని ఆయన సందర్శించారు. అక్కడ వైద్య పరీక్షలు చేయించుకోవడానికి వచ్చిన రోగులతో ఆయన మాట్లాడి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. శిబిరం వద్దకు వచ్చే ప్రజలకు వైద్య సిబ్బంది అందించే సేవలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొత్స నటరాజ్, ఎంపిటిసి పాటూరి సింహాచలం, మాజీ సర్పంచ్ బొత్స విశ్వనాథం, వైసిపి నాయకులు, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

డెంకాడ: గ్రామాల్లో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష (జెఎఎస్) శిబిరాలతో ఆరోగ్యంగా ఉండవచ్చునని డిఎంహెచ్ఒ భాస్కరరావు అన్నారు. మంగళవారం గుణుపూరుపేటలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పేషంట్ రిజిస్ట్రేషన్ జరుగు విధానం, లాబ్ టెస్ట్, ఫార్మసీ, కంటి వైద్య శిబరాలను సందర్శించారు. ఈ శిబిరంలో అందుతున్న వైద్యసేవలు గురించి డెంకాడ పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ బి. భవానీని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇద్దరు స్పెషలిస్ట్ డాక్టర్స్ మౌనిక, వెంకట భాస్కర్ రోగులకు వైద్య సేవలు అందించారు. కంటి పరీక్షలను డాక్టర్ మజ్జి గణపతిరావు తనిఖీ చేశారు. బీపీ, షుగర్ ఇతర వ్యాధులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, డెంకాడ పిహెచ్‌సి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మెంటాడ: రాష్ట్ర ముఖ్యమంత్రి అందరికీ ఆరోగ్యం అందించాలనే ఉద్దేశ్యంతో ప్రజల ముంగిటకు వైద్య సేవలు అందిస్తున్నారని ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని మీసాల పేటలో సర్పంచ్ మహంతి రామునాయుడు అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి సారికి ఈశ్వరరావు, వైసిపి మండల అధ్యక్షులు రాయపల్లి రామారావు, నాయకులు రత్నాకర్ నాయుడు, ఎంపిడిఒ త్రివిక్రమ రావు, వైద్యాధికారులు షేక్ జిలాన్ భాష, నవీన్ కిరణ్ మూర్తి, సి హెచ్ఒ శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పి బి పావని, రాబంద సర్పంచ్ కూనిశెట్టి తవుడు, గ్రామ కార్యదర్శి సత్యనారాయణ, సచివాలయ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతగా మానవ హక్కుల పరిరక్షణ

ప్రజాశక్తి- గరివిడి

మానవ హక్కుల పరిరక్షణను సామాజిక బాధ్యతగా భావించి ప్రతివారు భాగస్వాములు కావాలని భారతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పూర్ణచంద్ర సాహూ, గరివిడి పశు వైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ మక్కెన శ్రీను తదితర వక్తలు పిలుపునిచ్చారు. స్థానిక పశువైద్య కళాశాలలో విద్యార్థులకు మానవ హక్కులపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో అసమానతలు తొలగినప్పుడే, జాతి, వర్ణ, లింగ, కుల, మత, రాజకీయ కారణాలతో వివక్ష లేని జీవనం సాగించడానికి మానవ హక్కులు దోహదపడతాయన్నారు. భారతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఏపీ స్టేట్ ఉపాధ్యక్షుడు వైఎస్ చిన్నారావు, అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బిహెచ్‌ఆర్‌సి జాతీయ కార్యదర్శి సుందర్రావు, ప్రొఫెసర్ అంబేద్కర్, సహాయ అధ్యక్షుడు ఉప్పు శ్రీనివాసరావు, సీనియర్ జర్నలిస్ట్ హరీష్ కుమార్, డీసీసీబీ డైరెక్టర్ ఎస్ కాంతారావు తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాలలో విశిష్ట సేవలను అందించిన వారికి బిహెచ్‌ఆర్‌సి సంస్థ ప్రతినిధులు అవార్డులు అందించి సత్కరించారు. అవార్డులో అందుకున్న వారిలో విధి నిర్వహణతో పాటు, సాహిత్య విభాగంలో సేవలు అందిస్తున్న అసోసియేట్ డీన్ డాక్టర్ మక్కిన శ్రీను, సహాయ సంస్థ అధ్యక్షుడు ఉప్పు శ్రీనివాసరావు, సీనియర్ జర్నలిస్ట్ హరీష్ కుమార్, ప్రొఫెసర్ అంబేద్కర్, బిహెచ్‌ఆర్‌సి ప్రతినిధులు వైఎస్ చిన్నారావు, సుందర్ రావు, తదితరులు ఉన్నారు.

డైరెక్టర్‌గా చిన్నపుదొర కొనసాగింపు

బాడంగి: పారాది చిన్నపుదొరని ఆంధ్రప్రదేశ్ ఎస్‌టి కార్పొరేషన్ ట్రైకర్ డైరెక్టర్‌గా కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనేపథ్యంలో మంగళవారం ఆయన మళ్లీ విధుల్లోకి చేరి బాధ్యతలు స్వీకరించారు.

నిరాహార దీక్ష విరమణ

ప్రజాశక్తి- బొబ్బిలి

గ్రంథాలయ భవనం మరమ్మత్తు పనులను బుధవారం నుంచి ప్రారంభించి వారం రోజుల్లో పూర్తి చేస్తామని మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్ ఎఇ రవికుమార్ హామీ ఇవ్వడంతో జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాబు పాలూరి నిరాహారదీక్షను విరమించారు. నిరాహారదీక్ష శిబిరాన్ని బేబినాయన రెండోరోజు సందర్శించి మద్దతు ఇచ్చారు. బేబినాయన సమక్షంలో మున్సిపల్ అధికారులు హామీ ఇవ్వడంతో బాబు పాలూరికి బేబినాయన నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. గ్రంథాలయ సమస్యపై పోరాటం చేసిన జనసేన నేతలను బేబినాయన అభినందించారు. జనసేన చేపట్టిన దీక్షకు మంగళవారం లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జి, న్యాయవాది గంటి శర్మ, టిడిపి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, ఎంపిటిసిలు తదితరులు మద్దతు ప్రకటించారు.

చౌకబారు రాజకీయాలు మానుకోవాలి

గ్రంథాలయం భవనంపై జనసేన, టిడిపి చౌకబారు రాజకీయాలు మానుకోవాలని మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, జెసిఎస్ పట్టణ కన్వీనర్ రేజేటి విస్సు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. గ్రంథాలయ భవనం సమస్య ఇప్పటికిప్పుడు వచ్చింది కాదని, గత ఎన్నో ఏళ్ల నుంచి ఉందని గుర్తు చేశారు. గత పాలకులు ఎందుకు శాశ్వత భవనం నిర్మించలేదని ప్రశ్నించారు. నిరాహారదీక్ష చేసినంత మాత్రాన భయపడి పనులు చేయమని, ప్రజల అవసరాలను గుర్తించి సమస్యలు పరిష్కారానికి పని చేస్తామన్నారు. గ్రంథాలయానికి శాశ్వత భవనం లేకపోవడంతో పాఠశాల భవనాన్ని కేటాయించామన్నారు. గతేడాది సెప్టెంబర్‌లో రూ.1.60 లక్షలు కేటాయించామని చెట్టు ఉండడం వల్ల తొలగించడం కష్టంగా ఉందని, నిధులు చాలవన్న భావంతో రూ.5లక్షలతో చైతన్య కనస్ట్రక్షన్‌కు టెండర్ వస్తే పనులు చేయలేమని చేతులెత్తేయడంతో మరల టెండర్ పిలవడంతో బొరే శేషుబాబుకు టెండర్ వచ్చిందని, త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో దిగజారుడు రాజకీయాలు చేయడం సరికాదన్నారు. జెసిఎస్ పట్టణ కన్వీనర్ రేజేటి విస్సు మాట్లాడుతూ శాఖ గ్రంథాలయం కోసం గత 15ఏళ్లు ఎందుకు గుర్తుకు రాలేదని ప్రశ్నించారు. గత పాలకుల హయాంలో అద్దె భవనంలో నడిస్తే వైసిపి హయాంలో మున్సిపల్ పాఠశాల భవనాన్ని కేటాయించామన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్షులు చోడిగంజి రమేష్ నాయుడు, చోడిగంజి రాజగోపాల్ ఉన్నారు.



మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న బేబినాయన

న్యాయవాదుల నిరాహార దీక్షలు

గజపతినగరం: భూ యజమాన్య హక్కు చట్టం 2022ను తక్షణమే ప్రభుత్వం రద్దు చేయాలని స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు బిట్ర సూర్యారావు ఆధ్వర్యంలో న్యాయవాదుల నిరాహార దీక్షలు రెండవ రోజు కొనసాగుతున్నాయి. ఈ దీక్షలకు జనసేన నాయకులు పడాల అరుణ, సిపిఎం నాయకులు రాకోటి రాములు మద్దతు తెలిపి, భవిష్యత్తులో ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా అందజేయడానికి సిద్ధంగా ఉన్నామని భరోసా ఇచ్చారు. దీక్షలో న్యాయవాదులు పురుషోత్తమరావు, హరినాథరావు, లెంక రాంబాబు, కొల్లూరు సాయి శేఖర్, గెద్దాడ సూర్యనారాయణ, పిడుగు రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న నాయకులు

యువత ముందుకు రావాలి

ప్రజాశక్తి- బాడంగి

మండలంలోని తెంటువలస గ్రామ సమీపంలో ఉన్న కోనేరు పునర్నిర్మాణానికి సహాయ సహకారాలు అందించిన తెంటు సత్యనారాయణను ఆదర్శంగా తీసికొని యువత ముందుకు రావాలని ఎమ్మెల్యే సోదరుడు శంబంగి వేణు గోపాలనాయుడు అన్నారు. మంగళవారం కోనేరు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామానికి ఎల్లప్పుడూ సత్యనారాయణ ముందుండి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. ఉద్యోగాలు చేస్తున్న యువత తమ గ్రామాలాభివృద్ధి కోసం ముందడుగు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఆవు సత్యనారాయణ, జెసిఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు, తెంటు రామరావు, సత్యనారా యణ, తెంటు రమేష్, తెంటు గౌరునాయుడు, ఉడమల కాశినాయుడు, ఎంపిడిఒ, ఎపిఎం పాల్గొన్నారు.

అంగన్వాడీలకు జీవిత బీమా తప్పనిసరి

ప్రజాశక్తి- రేగిడి

కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి జీవన యోజన బీమా పథకంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని రాజాం ఐసిడిఎస్ ప్రాజెక్టు పిఒ తోట కనకదుర్గ తెలిపారు. మంగళవారం రేగిడి, సంకిలి, బూరాడ, ఉణుకూరు సెక్టార్లను పరిశీలించి, రికార్డులను ఆమె తనిఖీ చేశారు. కార్యకర్తలు ఆయాలకు భీమాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పిఎం జెవైపి, పిఎంఎస్‌బిపి ఈ రెండు బీమాలు కార్యకర్తలు, ఆయాలకు మేలు చేకూరుస్తాయన్నారు. ప్రధానమంత్రి జీవన యోజన బీమా పథకంలో రిజిస్ట్రేషన్ ఉంటే భీమా వర్తిస్తుందన్నారు. కార్యకర్తల ప్రతిరోజు సమయానికి కేంద్రాన్ని తెరవాలన్నారు. పౌష్టికాహారం ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ఇవ్వాలన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరిగితే తప్పనిసరిగా సమాచారం అందించాలని సూచించారు. నియోజకవర్గంలో 339 అంగన్వాడీ కేంద్రాలకు గాను 94 కేంద్రాలకు పక్కా భవనాలు ఉన్నాయని 27 అంగన్వాడీ కేంద్రాల నిర్వహణకు దాతలు ఉచితంగా భవనాలు అందించారని గుర్తు చేశారు. నాడు నేడులో నూతన అంగన్వాడి భవనాల నిర్మాణాలు వివిధ స్థాయిల్లో పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. మరికొన్ని భవనాలకు మరమ్మతులకు నిధులు మంజూరు అయ్యాయని వాటి పనులు జరుగుతున్నాయని అన్నారు. కార్యకర్తలకు ఆయాలకు సమస్యలు ఉంటే తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఆమె వెంట ఏసి నారాయణరావు, సూపర్వైజర్ శశికళ ఉన్నారు.

శ్రీ చైతన్యలో 'ఎస్ బ్యాచ్' ప్రారంభం

ప్రజాశక్తి- విజయనగరం

దేశ ఆర్థిక, సామాజిక అవసరాలకు అనుగుణంగా సివిల్ సర్వెంట్స్‌ను దేశానికి అందించాల్సిన ఆవశ్యకత నేటి విద్యా వ్యవస్థకు ఉందని ఈ దిశగా శ్రీ చైతన్య విద్యాసంస్థ ముందంజ వేస్తూ భవిష్యత్ తరాలను తీర్చిదిద్దుతుందని ఆంధ్రప్రదేశ్ శ్రీ చైతన్య విద్యాసంస్థల సివిల్స్ కోఆర్డినేటర్ నాగరాజు అన్నారు. స్థానిక రింగు రోడ్డులో గల శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో మంగళవారం ప్రారంభించిన 'ఎస్' బ్యాచ్ వివరాలను జోనల్ అకడమిక్ కోఆర్డినేటర్ బాలరాజుతో కలిసి ప్రారంభించారు. పాఠశాల ప్రాంతీయ పర్యవేక్షకులు వి. శ్రీనివాసరావు ఈ బ్యాచ్ పూర్తి వివరాలను తెలియజేస్తూ 6,7,8 తరగతుల స్థాయి నుండి సివిల్స్ లక్ష్యంగా విద్యార్థులను తీర్చిదిద్దే దిశగా పాఠశాలలో 'ఎస్' బ్యాచ్ ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్ బాబు, 'ఎస్ బ్యాచ్' ఇంచార్జ్ శేషగిరిరావు, పాఠశాల డీన్లు సత్యనారాయణ, సాయి కిషోర్, అప్పలనాయుడు, సూర్యచంద్ర, పాఠశాల సోషల్ స్టడీస్ ఉపాధ్యాయ వర్గం పాల్గొన్నారు.

మండలానికి 18 తాగునీటి బోర్లు

ప్రజాశక్తి - వేపాడ

మండలానికి 18 తాగునీటి బోర్లు మంజూరయ్యాయని ఎపిపి డి. సత్యవంతుడు తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో వేసవిలో తాగునీటి ఎద్దడిపై ముందస్తు చర్యలో భాగంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాగునీటి సమస్య తలెత్తకుండా జిల్లా పరిషత్ నిధుల నుంచి జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు 18 బోర్లు మంజూరు చేశారని ఎంపిపి తెలిపారు. వల్లంపూడి గ్రామానికి రెండు బోర్లు, డిఆర్‌పేట, కరకవలస, జాకేరు, సింగరాయ, ఆతవ, వేపాడ, ఎం.సింగవరం, బాణాది, బల్లంకి, చామలాపల్లి, ముకుందపురం గ్రామానికి ఒక్కో బోరు చొప్పున మంజూరు చేశామన్నారు. ఈ సమావేశంలో ఎస్ కోట నియోజకవర్గం ఆర్‌డబ్ల్యుఎస్ డి.ఇ.ఇ. కె.పైడిరాజు, పిఆర్‌జెఇ ఆలీ, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ వి.దేవి, వర్క్ ఇన్‌స్పెక్టర్ కామేష్ పాల్గొన్నారు.

సదస్సు విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - వేపాడ

ఫిబ్రవరి 2న తాటిపూడి శివాలయం వద్ద జరగనున్న సుజల స్రవంతి భూ నిర్వాసితుల సదస్సును విజయవంతం చేయాలని ఆ కమిటీ కన్వీనర్ చల్లా జగన్ కోరారు. మండలంలోని రామస్వామి పేటలో గ్రామంలో మంగళశారం రైతులను కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సదస్సుకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ, ఎమ్మెల్యే కడిబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, మాజీ ఎమ్మెల్యేలు కోళ్ల లలిత కుమారి, కొండపల్లి అప్పలనాయుడు, సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి రాంబాబు పోరాట కమిటీ గౌరవ అధ్యక్షులు బోదంకి గౌరీ నాయుడు హాజరవుతారని అధిక సంఖ్యలో రైతులు పాల్గొనాలని చెప్పారు.

పలుచోట్ల గాంధీ వర్ధంతి

ప్రజాశక్తి- మెంటాడ

మెంటాడ సచివాలయం ఆవరణలో మంగళవారం మహాత్మా గాంధీ 76వ వర్ధంతి సందర్భంగా జనవిజ్ఞాన వేదిక జాతీయ కార్యదర్శి గంరెడ్డి అప్పలనాయుడు గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రేగిడి రాంబాబు, విగ్రహాల దాత ముగడ లింగేశ్వర రావు, విశ్రాంత ఉపాధ్యాయులు మండల తిరుపతిరావు, సచివాలయం కార్యదర్శి రామనాథ్, రెగ్యులర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గొర్లె అప్పలనాయుడు, సచివాలయం సిబ్బంది, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

డెంకాడ: స్థానిక శాఖా గ్రంథాలయంలో గాంధీజీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి గ్రంథాలయాధికారి మహేష్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్య క్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలో గల గాంధీ బొమ్మ సెంటర్లో మహాత్మా గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే శంబంగి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు చోడిగంజి రమేష్, జెసిఎస్ కన్వీనర్ రేజేటి ఈశ్వరరావు, వైసిపి నాయకులు, పాల్గొన్నారు.



మెంటాడ: గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

శృంగవరపుకోట: స్థానిక గాంధీ పార్క్ ఆవరణలో గల మహత్మ గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ మండల అధ్యక్షులు గడి బంగారునాయుడు పూలమాలలు వేసి నివాళులర్పంచి అంజలి ఘటించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మోసకారి జగన్‌ను ఇంటికి పంపాలి

టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఒక్క ఛాన్స్ అని నమ్మించి మోసం చేసిన మోసకారి జగన్‌ను ఇంటికి పంపాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ అన్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పలు గ్రామాల్లో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. గొంప కృష్ణ కార్యాలయం నుంచి కొట్టం, రేవళ్లపాలెం, బాగారమ్మపాలెం, సీతారాంపురం, గోపాలపల్లి గ్రామాల్లో 200 మందితో ర్యాలీ చేశారు. అనంతరం గోపాలపల్లి గ్రామంలో గొంప కృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఏకపక్ష నిర్ణయాలు ప్రజలకు పెనుభారంగా మారాయన్నారు. జగన్ రెడ్డి ముఖ్యమంత్రి పదవీ చేపట్టినప్పటి నుండి పెట్రోల్, డీజిల్ ధరలను నిరంతరం పెంచుతూనే ఉన్నాడన్నారు. మూడేళ్లలో ఆరు సార్లు విద్యుత్ ఛార్జీలను పెంచిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. నిత్యావసరాల ధరలను మూడింతలు పెంచి సామాన్యులు ఏమి కొనలేని దుస్థితికి వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిందని విరుచుకుపడ్డారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాయవరపు చంద్రశేఖర్, జుత్తాడ రామసత్యం, ఆడారి రమేష్, మాదిబోయిన మంగరాజు, కోరుకొండ శ్రీను పాల్గొన్నారు.